అభివృద్ధి చేసేందుకు విజన్ ఉండాలి

- మున్సిపాల్టీల ఏర్పాటును రద్దు చేయాలి
- రూ. 270 కోట్లు రద్దు చేయడం భావ్యం కాదు
- ప్రజల దృష్టి మళ్లించేందుకే కుంటుంబ సర్వే
- ఏం చేశారని సంబురాలు చేస్కుంటరు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, నవంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, అభివృద్ధిని చేసేందుకు ఓ విజన్ ఉండాలని, ఆ విజన్ ఉన్న నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కరూ లేరని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కందుకూరు మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి చేయడానికి నాయకులు ఒక విజన్ ఉండాలని అన్నారు. ఎన్నిల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దృష్టి మళ్లించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుంటుంబ సర్వే నిర్వహిస్తుందని, ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తులు ఎటుపోయాయి? అని ప్రశ్నించారు. కందుకూరు, మహేశ్వరం, చేవెళ్ల మండలాలను మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేస్తున్నారని, ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని అన్నారు. మున్సిపాల్టీలను ఏర్పాటు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని ఒక వైపు రైతులు భూములు కోల్పోయి ఇబ్బందులు పడతుంటే మరోవైపు ఉపాధి హామీ కూలీలు పని దొరకక అవస్థలు పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పక్ష ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గం అభివృద్ధికి రూ. 270 కోట్లు మంజూరు చేస్తే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను చూస్తే ప్రజల్లో గందరగోళం నెలకొందని పేర్కొన్నారు. 420 ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందన్నారు. ఏం సాధించారని సంబురాలు చేసుకుంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు మాట తప్పినందుకా..? సంబురాలు చేసుకునేది? అని ప్రశ్నించారు. టీఎస్ ఐఐసీ ద్వారా నిధులు తీసుకవచ్చి ఫార్మా సిటీ భూములు కోల్పోయిన గ్రామాలకు రూ.5 కోట్లకు పైగా మంజూరు చేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సబితా ఇంద్రారెడ్డి కోరారు. ఎమ్మెల్యే మండల పరిధిలోని గూడూరు వెళ్తుండగా రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టారు. విషయాన్ని గమనించిన ఆమె రైతుల వద్దకు వెళ్లి మాట్లాడారు. రోడ్డుపై ఎందుకు ఆరబెట్టారని, కొనుగోలు, దిగుబడి, రైతు బంధు వస్తుందా? అన్న విషయాలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు వారి సమస్యలను సబితా ఇంద్రారెడ్డికి వివరించారు. రైతు బంధు రావడం లేదని, కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయినట్లు రైతులు పలువురు వివరించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, గయ్యాని సామయ్య, డైరెక్టరు పొట్టి ఆనంద్, జంగయ్యలు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

డా. సౌమ్య స్వామినాథన్‌కు ప్రతిష్టాత్మక ఫాబా అవార్డు

ఫాబా అవార్డును డాక్టర్ సౌమ్య స్వామినాథన్‌కు అందజేస్తున్న వీసీ బీజే రావు

కొండాపూర్, నవంబర్ 25: వైద్య పరిశోధన, ప్రజారోగ్యంలో క్షయ వ్యాధి, హెచ్ ఐవీ/ ఎయిడ్స్ వ్యాధుల పరిశోధనలో డాక్టర్ సౌమ్య స్వామినాథన్ అందించిన సేవలకు ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ) లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సత్కరించింది. యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ బీజే రావు చేతుల మీదుగా ఆమెకు అవార్డును అందజేశారు. డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ప్రఖ్యాత శిశు వైద్యురాలు, క్లినికల్ సైంటిస్ట్, ప్రపంచ ఆరోగ్యం సంఘంలో కీలక పాత్ర పోషించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)లో ప్రధాన శాస్త్రవేత్తగా ఆమె కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం, ఆమె భారతదేశ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమానికి ప్రధాన సలహాదారుగా పని చేస్తున్నారు.

పరిశ్రమల వార్షిక సర్వే పోర్టల్‌పై అవగాహన

సిటీబ్యూరో, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): కేంద్ర గణాంక కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల వార్షిక సర్వే (ఏఎస్ఐ) సంకలనంపై రెడ్ హిల్స్‌లోని ఫిక్కీ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్ఐ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజిత్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ శివ పార్వతి రెడ్డి, ఎస్.గురుస్వామి, రమేష్ మెండు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

ప్రజావాణిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 25: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 67 ఫిర్యాదులను ప్రజల నుంచి కలెక్టర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు అందించిన వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లా ఆఫీసర్ చంద్రవతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి

స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు

ధర్నా చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

చిక్కడపల్లి, నవంబర్ 25: ఉర్దూ ఉపాధ్యాయులకు సంబంధించి ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐడీ) విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు సోమవారం ఇందిరా పార్కు చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఎస్ఐడీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఫిరోజ్ ఖాన్, అబ్దుల్ తాజ్‌లు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1183 పోస్టులు ఖాళీగా ఉండగా, అందులో 570 పోస్టులు మాత్రమే భర్తీ చేశారని తెలిపారు. మిగతా 666 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వెంటనే మిగతా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఖాళీగా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిధుల వేటలో.. హెచ్ఎండీఏ

- భారీ ప్రాజెక్టులకు ఆర్థిక వనరులు సమకూర్చుకునే యోచన
- ప్రతిపాదిత ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్ల అంచనా వ్యయం

సిటీబ్యూరో, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడింది. ప్రాజెక్టులను వేగంగా పట్టాలెక్కించాలంటే ఆర్థిక వనరులు అడ్డు తగులుతున్నాయి. దీంతో హెచ్ఎండీఏ చేపట్టిన కొన్ని భారీ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. ప్రధానంగా ప్రాజెక్టులను పూర్తి చేయడం కంటే ప్రారంభించడమే గగనంగా మారింది. దీంతో గతమెంతో ఘనంగా ఉన్నా హెచ్ఎండీఏ ఇప్పుడు ఆర్థికంగా చితికిపోయింది. దీంతో నిధులు ఉన్నప్పుడే ప్రాజెక్టులు పూర్తి చేసే పరిస్థితులు వస్తాయని హెచ్ఎండీఏ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ఏడు జిల్లాల్లో విస్తరించిన హెచ్ఎండీఏకు గడిచిన పదేళ్లలో ఏనాడు నిధుల సమీకరణ, ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం సమస్య కాలేదు. కానీ, గడిచిన ఏడాది కాలంగా పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. దీంతో చేపట్టిన ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయలేని దుస్థితి వచ్చింది. ప్రభుత్వం నుంచి అరకొర ఆర్థిక సాయంతో, ఆర్థికంగా స్వయం ప్రతిపత్తి సాధించిన హెచ్ఎండీఏ ఇప్పుడు నిధుల కోసం దిక్కులు చూడాల్సిన వస్తోంది. దీంతో హెచ్ఎండీఏ పరిధిలో చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో పాటు సాధారణ పనులను కూడా మొదలుపెట్టే వీల్లేకుండా పోతుంది.

hmda Growing Global

నిధుల కొరతలో హెచ్ఎండీఏ...

ఇటీవల కాలంలో హెచ్ఎండీఏకు వచ్చే ప్రధాన ఆదాయ మార్గాలైన భవన నిర్మాణ అనుమతులు. వీటి ద్వారా మెజార్టీ రెవెన్యూ సమకూరేది. ప్లానింగ్ విభాగం సేకరించే నిధులకు అదనంగా భూముల వేలం, డెవలప్‌మెంట్ యాక్టివిటీలతో హెచ్ఎండీఏ ఖజానా నిండుకునేది. కానీ, పరిస్థితి తలకిందులైంది. వచ్చే ఆదాయం ఏకంగా 50 శాతానికి తగ్గింది. దీంతో నెలవారీ నిర్వహణ, జీత భత్యాలు మినహా కొత్త ప్రాజెక్టులను చేపట్టాలంటే వెనుకంజ వేస్తున్నారు. ప్రధానంగా ప్రతిపాదిత ప్రాజెక్టులను కూడా పూర్తి స్థాయిలో కార్య రూపంలోకి తీసుకు రాలేకపోతున్నారు. మైనర్ పనులకు టెండర్లను ఆహ్వానిస్తున్నా.., నిధుల కొరతతో పూర్తి స్థాయిలో పనులు చేపట్టే అవకాశం లేదని హెచ్ఎండీఏ వర్గాలు చెబుతున్నాయి. గ్లోబల్ సిటీగా నగరాన్ని అభివృద్ధి చేసినప్పుడే, హైదరాబాద్ కేంద్రంగా కొత్త పెట్టుబడులు వస్తాయి. కానీ, ప్రభుత్వం గడిచిన ఏడాది కాలంగా గుర్తించే స్థాయిలో ఏ ఒక్క ప్రాజెక్టును చేపట్టలేదు. కనీసం శంకుస్థాపన చేసిన రెండు ఎలివేటెడ్ కారిడార్ పనులను కూడా ఇప్పటివరకు పట్టా లెక్కించలేదు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం భూసేకరణతో కలిపి మొత్తం రూ.10 వేల కోట్లు దాటుతుండగా, మరో రూ.2 వేల కోట్లతో ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. దీంతో భారీ స్థాయిలో నిధులు సమకూరితే తప్పా, ప్రాజెక్టులను మొదలుపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటికీ కొత్వాల్‌గూడ ఎకో పార్క్ పనులు జరుగుతుండగా, మరోవైపు మీరాలం చెరువుపై ప్రతిపాదిత కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కూడా ఇప్పట్లో మొదలయ్యేలా లేదు. దీంతో పాటు ఏరియల్ రోడ్ల నిర్మాణం కూడా పెండింగ్‌లోనే ఉంది.

ప్రాటోకాల్ ఉల్లంఘిస్తున్న అధికారులు

గ్రేటర్ మున్సిపల్ మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

మల్కాజిగిరి, నవంబర్ 25: మల్కాజిగిరి నియోజక వర్గంలో ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి, ప్రారంభోత్సవాలలో అధికారులు ప్రోటోకాల్ పాటించడంలేదని కార్పొరేటర్లు సునీతా రాము యాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా కిశోర్‌లు అన్నారు. అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్నారని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మికి కార్పొరేటర్లు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్లలో ప్రారంభోత్సవాలవంటి కార్యక్రమాలలో ప్రోటోకాల్‌కు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు తెలుపగా పనులు ప్రారంభిస్తున్నారని అన్నారు. అధికారులపై బాహాటంగానే రాజకీయ ఒత్తిడి ఉందని వారంటున్నారని అన్నారు. సదరు అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం సెక్షన్ 153, 154, 155 ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనకు సంబంధించిన పత్రికలలో ప్రచురించిన ఆధారాలు సమర్పించామన్నారు.

గ్రేటర్‌లో తుది దశకు ఇంటింటి సర్వే

- 78.53 శాతం మేర సర్వే పూర్తి

సిటీబ్యూరో, నవంబరు 25(నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తుది దశకు చేరుకున్నది. సోమవారం నాటికి 78.53 శాతం సర్వే పూర్తయ్యిందని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 19,04,977 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ సర్కిల్ వారీగా చేపడుతుందని, డేటా నమోదు సమయంలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా, కోడింగ్ సరియైన విధంగా ఉండేలా చూడాలని అధికారులు సూచించారు. కుటుంబ డేటా ఎంట్రీని ఆన్‌లైన్‌లో సజావుగా, నిశితంగా నమోదు చేయాలని సూచించారు. సర్వే పూర్తయిన ఫారాలను భద్రంగా నిల్వ చేయాలని, ఒక్క ఫారం కూడా బయట కనిపించకుండా ఉండేలా అన్ని ఫారాలను స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చాలని డిప్యూటీ కమిషనర్లు ఆదేశించారు.

తెలుగు వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య హనుమంతరావు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లలిత కళాపీఠం, రంగస్థల కళల శాఖలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య కోట్ల హనుమంతరావును నూతన రిజిస్ట్రార్‌గా వీసీ ఆచార్య నిత్యానంద రావు నియమించారు. ఈ మేరకు వీసీ సోమవారం తన చాంబర్‌లో నియామకం పత్రాన్ని హనుమంతరావుకు అందజేశారు. – తెలుగు యూనివర్సిటీ

అంబేద్కర్ యూనివర్సిటీ వంటా వార్పు వాయిదా

- డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఉద్యోగుల జేఏసీ

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బంజారాహిల్స్, నవంబర్ 25: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించడాన్ని ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో వ్యతిరేకత తెలుపుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ నెల 27న నిర్వహించతలపెట్టిన 'వంటా వార్పు' కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు జేఏసీ నేతలు ప్రకటించారు. సోమవారం యూనివర్సిటీ ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమంలో జేఏసీ చైర్ పర్సన్ ప్రొ. పల్లవీ కాట్జే, సెక్రటరీ జనరల్ డా. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్ చెప్పారని, ఇప్పటికిప్పుడు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం భావ్యం కాదని సూచించారని పేర్కొన్నారు. ప్రొ.కోదండరామ్ హామీ మేరకు ఈనెల 27న తలపెట్టిన 'వంటా వార్పు' కార్యక్రమాన్ని వాయిదా వేశామని, ప్రభుత్వ నిర్ణయం రాకపోతే మరికొన్ని రోజుల్లో వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు డా.వెంకటేశ్వర్లు, డా. యాకేశ్ దైద, డా. ఉదయిని పాల్గొన్నారు.

సజావుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలి సమావేశం

మలక్‌పేట, నవంబర్ 25: హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ జనరల్ బాడీ సమావేశం సోమవారం మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ లక్ష్మీ అధ్యక్షతన పాలకవర్గ సభ్యులు, అధికారులతో మధ్య జరిగింది. నూతన పాలకవర్గం ఏర్పడిన తర్వాత నిర్వహించిన తొలి సమావేశం కావటంతో మార్కెట్‌కు సంబంధించిన ఎలాంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరగలేదు. నూతన సభ్యులు అధికారులతో, సహచర సభ్యులతో పరిచయాల అనంతరం, పదవులు కట్టబెట్టిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపి సమావేశాన్ని ముగించాలని తీర్మానించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు నెలపాటి రామారావు, పన్నాల రాజేందర్ రెడ్డి, ఎండీ షకీల్, ఎస్యూ ప్రత్యూష, బుద్ధ సత్యనారాయణ, ఎం.సాయిరాం, మస్రత్ సుల్తానా, పాషం అశోక్ గౌడ్, కంకాలి శివాజీ, పి.కిషన్ సింగ్, డి.జగదీశ్, ఎం.కృష్ణ, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి దామోదర్, గ్రేడ్–1 కార్యదర్శి చిలకా నర్సింహారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి నిరాకరణ

- మార్కెట్ నిబంధనలకు విరుద్ధమని వెల్లడి

పాలక వర్గం ఏర్పడి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రతి కార్యక్రమానికి హాజరవుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మార్కెట్ కార్యాలయంలో నిర్వహిస్తున్న జనరల్ బాడీ సమావేశంలో కూడా పాల్గొనేందుకు రాగా, అధికారులు తిరస్కరించారు. మార్కెట్ అంశాలపై మార్కెట్ పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి నిర్వహించే జనరల్ బాడీ సమావేశంలో అన్యులు పాల్గొనటం మార్కెట్ నిబంధనలకు విరుద్ధమని, దానిని అంగీకరించబోమని అధికారులు తేల్చి తెలిపారు. నూతన చైర్మన్‌గా నియమితులైన తన సతీమణికి మార్కెట్‌పై అవగాహన వచ్చే వరకు తనతో పాటు తాను కూడా హాజరవుతానని, ఈ సమావేశం మినహాయించి తర్వాత జరిగే ప్రతి సమావేశానికి తాను హాజరవుతానని అనటంతో అధికారులు అందుకు అంగీకరించలేదు. దాంతో జనరల్ బాడీ సమావేశం జరిగే సమావేశ మందిరంలో కాకుండా శ్రీనివాస్‌ను మరో గదిలో కూర్చునేందుకు అనుమతిచ్చారు.

యువజనంతోనే వారసత్వ పరిరక్షణ

- పలువురు చరిత్రకారులు

సిటీబ్యూరో, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): యువతతోనే వారసత్వ సంపద పరిరక్షణ సాధ్యమని, బాధ్యతాయుతంగా పౌర సమాజంలో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చరిత్రకారులు అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరల్డ్ హెరిటేజ్ వీక్ సెలబ్రేషన్స్ కార్యక్రమాలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం పలువురు పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్ ఆర్కిటెక్చర్ విద్యార్థుల కోసం 'పునరుజ్జీవన వారసత్వం – ముదుమల్ మెగాలిథిక్ మెంహిర్స్' పేరుతో డిజైన్ పోటీలను నిర్వహించారు. జేబీఆర్ ఆర్కిటెక్చర్ కాలేజీ కార్యక్రమాలను నిర్వహించగా, ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, జేఎన్ఏఎఫ్ఏయూ, ఓయూ ఆర్కియాలజీ విద్యార్థులు, ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ సెంటినరీ హెరిటేజ్ మ్యూజియం, బౌద్ధుల సైట్ మ్యూజియం, ఫణిగిరి పేరిట రెండు బ్రోచర్లను విడుదల చేశారు. వారసత్వ పరిరక్షణలో విద్యావేత్తలు, స్థానిక సంస్థలు భాగస్వామ్యం కావాలని, ప్రధానంగా యువత రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ మూలాలను పరిరక్షించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్, డైరెక్టర్ నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ నాగరాజ్, హెరిటేజ్ తెలంగాణ విభాగం, ప్లీచ్ ఇండియా సీఈఓ డా. శివనాగిరెడ్డి, ఇంటాక్ న్యూఢిల్లీ సభ్యులు డా. దీపేంద్ర శర్మ, కోటయ్య వింజమూరి, ఏఎస్ఐ అసిస్టెంట్ ప్రొ. జయశ్రీ, ఇంటాక్ హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్ పి.అనూరాధా రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణికి 208 దరఖాస్తులు

సిటీబ్యూరో, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో 208 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 166 దరఖాస్తులు గృహ నిర్మాణ శాఖకు సంబంధించినవని అదనపు కలెక్టర్ కదిరవ్ పలని తెలిపారు. దరఖాస్తులన్నింటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుపై స్పందన కరువు

మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ

మణికొండ, నవంబర్ 25: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ బాబా సాహెచ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం అనుమతి కోరిన మణికొండ మున్సిపాలిటీ అధికారులు స్పందించకపోవడం దారుణమని కమిషనర్‌కు మణికొండ మున్సిపాలిటీ భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. గతంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రెండు చోట్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మున్సిపాలిటీ కమిషనర్‌ను కలిసి విన్నవించామన్నారు. కానీ, ఆయన స్పందించకుండా తమను అవమానించారన్నారు. 2019లో రూ.45 లక్షల బడ్జెట్‌తో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేరున భవనాన్ని నిర్మించడానికి శంకుస్థాపన, శిలా ఫలకం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంకా ఈ పనులను చేపట్టకపోవడం చూస్తుంటే అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. మంజూరైన రూ.45 లక్షల బడ్జెట్‌ను దారి మళ్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. అంబేద్కర్ భవన్ నిర్మించేందుకు శంకుస్థాపన చేసిన స్థలంలో వేరే బిల్డింగ్ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నవంబర్ 26న 75వ రాజ్యాంగ దినోత్సవం జరుపుకునే రోజుల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కి మణికొండ మున్సిపాలిటీ తగిన గౌరవం ఇవ్వకపోవడం గమనార్హం.

సోలార్ ప్యానెళ్లతో అధిక ఉష్ణోగ్రతలు

- ఆ వేడిమి వల్లనే భారీ వర్షాలు
- శాస్త్రవేత్త డాక్టర్ ఇబ్రాం గణేశ్

ఖైరతాబాద్, నవంబర్ 25: సోలార్ ప్యానెళ్లతో వాతావరణంలో ఉష్ణోగ్రతలు అధికంగా పెరుగుతున్నాయని శాస్త్రవేత్త డాక్టర్ ఇబ్రాం గణేశ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ తగిన సహకారాలు అందిస్తోందని, అయితే, సోలార్ ప్యానెళ్లలో ఉండే సిలికాన్ ఫొటోవాల్టిక్ సెల్ వల్ల 20 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగితే అత్యధిక శాతం వేడిని పుట్టిస్తుందని, ఆ వేడిమి వల్ల భూమిపై ఉన్న నీరు ఆవిరిగా మారి భారీ అకాల వర్షాలకు దారి తీస్తున్నాయని, పక్షులు మరణిస్తున్నాయని తెలిపారు. దీనికి పరిష్కారంగా తాను ప్రత్యేకమైన ప్యానెల్‌ను రూపొందించానన్నారు. సెమీ కండక్టర్ అండ్ లిక్విడ్ అసిస్టెంట్ ఫొటోథర్మల్ ఎఫెక్ట్ ప్యానెల్‌తో అందులో నుంచి వచ్చిన వేడిని కూడా విద్యుత్‌గా మార్చే ప్రక్రియ ద్వారా అధిక ఉష్ణోగ్రతలకు తావులేకుండా పోతుందన్నారు. దీనికి సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపించానని పేర్కొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలి

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

కాచిగూడ, నవంబర్ 25: సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పెన్షన్‌దారుల అందరికీ వర్తింపజేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈపీఎఫ్ రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బర్కత్‌పుర ఈపీఎఫ్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ